క్లుప్తంగా

ప్రైవేట్ కేబుల్స్ తొలగించాలి

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇంటర్నెట్, కేబుల్స్‌ను తొలగించాలని ఏరియా జీఎం షాలేమురాజు కోరారు. ఆదివారం ఇల్లెందులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో తరుచూ తనిఖీలు జరుగుతున్నాయని, ఈ తనిఖీల్లో ఇంటర్నెట్ ప్రొవైడర్ కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌పై (ఓఎఫ్‌సీ) కేబుల్ వేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ పనిని వర్క్ షాపు సిబ్బంది అడ్డుకున్నారని తెలిపారు. కేబుల్‌ను సిబ్బందితో తొలగించామన్నారు. కాలనీలో 33 కేవీ స్తంభాలు చాలా ప్రమాదకరమన్నారు. వాటిపై పని చేసేటప్పుడు వారి ప్రాణాలకే ప్రమాదమని పేర్కొన్నారు. తక్షణమే స్తంభాలు, ట్రాన్స్‌ఫారంల మీద వేసిన కేబుల్స్ తొలిగించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ కృష్ణ

ఇల్లెందురూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని మామిడిగుండాల గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజ కృష్ణ అన్నారు. మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ బోటగుంపు గ్రామంలో సూర్నపాక కోటమ్మకు రూ.48,000, ఈసం రామారావుకు రూ.27,500 సీఎంఆర్‌ఎఫ్ మంజూరయింది. ఈ చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసిన తరువాత దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి, అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సుందర్‌రావు

జూలూరుపాడు: గుండెపుడి గ్రామ పంచాయతీ గుమస్తా సూరోజు వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం వెంకటేశ్వర్లు కుటుంబానికి జూలూరుపాడు క్రషర్ మిల్లు యజమాని గొల్లపుడి శ్యామ్ సుందర్‌రావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బానోత్ నరసింహారావు, సొసైటీ డైరెక్టర్ కొమ్మినేని పాండురంగారావు పాల్గొన్నారు.

'సేవ్ కాంగ్రెస్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్

చుంచుపల్లి: జిల్లాలో త్వరలో చేపట్టనున్న సేవ్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ శంకర్ నాయక్, లక్కినేని సురేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సేవ్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో ఫిబ్రవరి 1న ఖమ్మంలో మొదటి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులందరూ పాల్గొని పార్టీని రక్షించుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలమైన పార్టీగా ఉందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన వారుండగా మధ్యలో కొంతమంది నాయకులు వచ్చి పార్టీని చలికల పడేలా, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఫిబ్రవరి 6న భద్రాచలంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న మహోత్తర హాత్ సే హాత్ జోడో యాత్ర, భారీ బహిరంగ సభలో కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మణుగూరు మండల అధ్యక్షుడు గురజాల గోపి, ములకలపల్లి మండల అధ్యక్షుడు పేటేటి నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు దళ్‌సింగ్ నాయక్, కిషోర్, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, మహేష్, పాండురంగ, దేవారాజు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య మళ్లీ మొదటికి..

ప్రతి ఇంటికి నల్లా ఏర్పాటు.. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భగీరథ ట్యాంకు.. అయినా గ్రామంలో మాత్రం తాగునీరు దొరకదు. ఇది రూప్లా తండా గ్రామం పరిస్థితి. మండలంలోని కొత్త అంజనాపురం గ్రామ పంచాయతీ రూప్లా తండా గ్రామంలో మూడేళ్లుగా తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. గ్రామంలో దారితీసిన ఓ సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకోకపోవడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. దీంతో గ్రామంలోని గిరిజనులు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు.



చేతిపంపు వద్ద నీళ్లు పట్టుకుంటున్న గిరిజనులు

- భగీరథ ట్యాంకు ఉన్నా అందని తాగునీరు
- ఓ సమస్యను పరిష్కరిస్తేనే గ్రామానికి నీటి సరఫరా
- స్పందించని అధికారులు

సుజాతనగర్: రూప్లాతండా గ్రామంలో సుమారు 150 గృహాలు ఉన్నాయి. వీరంతా గిరిజనులే. ఇంటింటికీ తాగునీటి పథకంలో భాగంగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాల్సి వచ్చింది. ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన తేజావత్ జగ్నా ఇచ్చిన స్థలంలో మూడేళ్ల క్రితం వాటర్ ట్యాంకు నిర్మించారు. ట్యాంకు నిర్మాణానికి స్థలం ఇవ్వాలంటే తన కుమారుడు తేజావత్ హతీరాంకు పంప్ ఆపరేటర్‌గా ఉద్యోగం కల్పించాలంటూ ఆ సమయంలో జగ్నా కోరాడు. దీంతో అతని కుమారునికి ఉద్యోగం కల్పిస్తామని గ్రామ పంచాయతీ సిబ్బంది హామీ ఇచ్చిన నేపథ్యంలో వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగింది.

స్థలం ఇచ్చినా ఫలితం దక్కలేదు..

తన కుమారునికి ఉద్యోగం కల్పిస్తారనే జగ్నా ఆశలు ఆ తరువాత అడియాశలుగా మారాయి. రోజులు గడుస్తున్నా తన కుమారుడికి ఉద్యోగం రాకపోవడం.. పంప్ ఆపరేటర్‌గా తాను పనిచేసిన కాలానికి వేతనం ఇవ్వకపోవడం జగ్నాను మనస్థాపానికి గురిచేశాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలంటూ పలుమార్లు జగ్నా అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. స్పందన లేకపోవడంతో మనోవేదనతో పంట చేలో పురుగుమందు తాగి రెండేళ్ల క్రితం మృతి చెందాడు.

మళ్లీ మొదటికొచ్చిన సమస్య..

జగ్నా మృతి అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధుల్లో కదలిక వచ్చింది. మృతుడి కుమారుడు హతీరాంకు పాల్వంచలోని ఓ పార్క్‌లో ఉద్యోగం కల్పించారు. అయితే తనకు ఉద్యోగం దక్కిందన్న ఆనందం ఏడాదిలోనే ఆవిరైంది. సంవత్సరానికే అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో రూప్లా తండా గ్రామంలో తాగునీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పాల్వంచలో ఉద్యోగం నుంచి తొలగించిన అనంతరం హతీరాం తనకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా సమస్యకు తెర పడలేదు. తనకు ఉద్యోగం రాకపోవడంతో న్యాయం చేయాలంటూ నాటి నుంచి హతీరాం డిమాండ్ చేస్తూ వస్తున్నాడు. తనకు ఉద్యోగం కల్పించేంత వరకు గ్రామంలో నీళ్ల వదిలేది లేదంటూ అడ్డుకుంటున్నాడు. ఈ కారణంగా గ్రామంలో తాగునీటి సమస్య అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న మాదిరిగా ఉంది. దీంతో ట్రాక్టర్ ద్వారా గ్రామానికి మంచినీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ సమస్యకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో సరిగా నీళ్ల రావడం లేదు. చేతి పంపులు, బోర్ల పైన ఆధారపడుతున్నాం. వ్యవసాయ పనులు చేసుకొని ఇంటికి వచ్చి చేతి పంపు వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

– తేజావత్ తులసి

ఉద్యోగం కల్పించాలి



హతీరాంకు ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి లోనై మా అన్న జగ్నా చనిపోయాడు. మొదట్లో మిషన్ భగీరథ అధికారులు, ఇచ్చిన హామీ మేరకు హతీరాంకు ఉద్యోగం కల్పించి గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం చూపాలి.

– తేజావత్ రాందాస్

పరిష్కారానికి కృషి చేస్తా



సంవత్సరం తరువాత ఉద్యోగం తొలగించిన విషయం మా దృష్టికి రాలేదు. ఉద్యోగం విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏం హామీ ఇచ్చారో తెలుసుకుంటాను. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ

కార్మికోద్యమాలు నిర్మిద్దాం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధన, వారి సౌకర్యాల ఏర్పాటుకై బలమైన యూనియన్‌గా ఇఫ్టూని రూపొందించాలని, వారి హక్కుల సాధనకై పోరాటాలు ఉధృతం చేయాలని ఇఫ్టూ ఆలిండియా కార్యదర్శి బుర్గుల ప్రదీప్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఉర్దూఘర్‌లో జరిగిన ఇఫ్టూ రాష్ట్ర ఏడో మహాసభకు 11 ఏరియా కార్మికులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రదీప్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఒకప్పుడు బొగ్గు పరిశ్రమ జాతీయ పరిశ్రమగా ఉండేదని, ఈరోజు దేశ ప్రయోజనాలను, కార్పొరేట్లకు తాకట్టుపెడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను, సౌకర్యాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వాటిని కార్పొరేటర్లకు అనుకూలంగా మార్చటం, అవి కార్మికుల జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, స్థిరమైన ఉపాధి, అవకాశాలు లేకుండా ఎనిమిది లక్షలు ఉన్న కార్మికుల సంఖ్య నేడు 3 లక్షలకు మోదీ తగ్గించేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ, ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఆటల వల్ల ఆలోచనా శక్తి పెరుగుతుంది



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సామ్యూల్ సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ యానివర్సరీ సెలబ్రేషన్ ఆదివారం రుద్రంపూర్‌లోని సీఓఏ క్లబ్‌లో జరిగింది. ఏరియా డీజీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ.. ఈ సెలబ్రేషన్ ప్రతి ఏడాది జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతిరోజూ ప్రతి కార్మికుడు ఏదో ఒక గేమ్ ఆడాలని, ఆటల వలన మెదడు చాలా యాక్టివ్‌గా పనిచేస్తుందని, అంతేకాకుండా ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అండర్ గ్రౌండ్ గనుల ఏజెంట్ బి.రవీందర్, పీవీకే గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, అధికారులు రామకృష్ణ, పీఓలు మురళీ, సుధాకర్, సెక్రటరీ అజయ్, కోఆర్డినేటర్ రాజశేఖర్, నిమ్మల రాజేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, బన్ను, రాజు, చిరంజీవి, నరసింహా, వినయ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణాలు సురక్షితం

టేకులపల్లి: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని, క్షేమంగా గమ్యానికి చేరుకోగలరని హెడ్‌కానిస్టేబుల్ పి.కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం సీఐ ఏలేటి ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ భూక్యా శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు టేకులపల్లి పోలీసు శాఖ ఆధ్వర్యంలో టేకులపల్లి సెంటర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్ ధరించడం లేదని, మద్యం సేవించి, అధిక స్పీడ్‌తో వాహనాలు నడుపుతుండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అర్ధాంతరంగా వాహనదారుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయన్నారు. వాహనదారులు అర్హత, అనుభవం, లైసెన్స్ ఉంటేనే డ్రైవింగ్ చేయాలని, వాహనం వెంట అన్ని ధృవీకరణ పత్రాలు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు భాను, భాస్కర్, ఐలయ్య, వాహనదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

జూలూరుపాడు: ఫిబ్రవరి 15న నిర్వహించే శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5వ తేదీన వరంగల్‌లో జరిగే ఎల్‌హెచ్‌పీఎస్ కేంద్ర, రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్టీల రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఎస్టీల రిజర్వేషన్‌ను 7.5 శాతం నుంచి 14 శాతానికి పెంచాలని ఆయన కోరారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ జూలూరుపాడు మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా దండుమిట్ట తండాకు చెందిన భూక్యా రవి నాయక్, ప్రధాన కార్యదర్శిగా పాపకొల్లుకు చెందిన వాంకుడోత్ కిషన్ నాయక్, కోశాధికారిగా శివ నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్ నాయక్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మోహన్ నాయక్, గుగులోత్ కేశవ్ నాయక్, ధరంసోత్ దశరథ్ నాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఫిర్యాదు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూ ఆక్రమణదారులు తనపై అకారణంగా దాడికి పాల్పడ్డారని బాలాజీనగర్‌కు చెందిన ఉమర్, ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలు... బాలాజీనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ భూమిని వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్ ఆక్రమించాడని, ఇదే విషయంలో స్థానిక మహిళలు ప్రశ్నించిన వివరాలను తాను గ్రామ పంచాయతీ గ్రూపులో పోస్టు చేయడం జరిగిందన్నారు. దీన్ని సాకుగా చూపుతూ వైస్ ఎంపీపీ ప్రమోద్ అనుచరులు మహేష్, వంశీ ఇరువురు తమపై భౌతిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. తమను చంపుతామని బెదిరించారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

కనకయ్య మృతికి సంతాపం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ట్రేడ్ యూనియన్ నాయకులు, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కాసర్ల కనకయ్య (61) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలిసిన అభ్యుదయ కళాసేవా సమితి జిల్లా అధ్యక్షుడు, ఆచార్య మద్దెల శివకుమార్ కనకయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సల్లా సుదర్శన్, బీర మోహన్‌రావు, సామ్యేల్ విజయరాజ్, స్టీవెన్ లాజరస్, కట్టెలమండ శ్రీను, బి.రాజేశ్వరరావు, కాలం నాగభూషణం, రవీందర్, శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జూలూరుపాడు: ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న కొత్తగూడెం కోర్టులో జరగనున్న మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ జె.వసంతకుమార్, ఎస్సై పోటు గణేష్ కోరారు. ఆదివారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయని, కలిసుందామని ఒక నిర్ణయానికి వస్తే సమసి పోతాయన్నారు. మంచి, చెడులు ఉంటాయని, కావాలని వివాదాలకు ఎవరూ పోరని, కొన్ని సమయాల్లో అనుకోకుండానే సన్నిహితంగా మెలిగే వారి మధ్య గొడవలు, వివాదాలు వస్తుంటాయన్నారు. అందుకే గొడవలు వద్దు–రాజీలు ముద్దు అన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 11 వరకు మీపై గానీ, మీకు తెలిసిన వాళ్లపై గానీ కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకోవడానికి కోర్టుకు హాజరైతే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందన్నారు. యాక్సిడెంట్, దాడులు (కొట్టుకున్న), చీటింగ్ కేసులు, వివాహానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పెట్టిన కేసులు రాజీ పడేందుకు మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని క్లోజ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సమస్యలపై పోరాడుదాం..

పాల్వంచ: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుదామని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర నాయకులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పాల్వంచలో జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం బి.వెంకన్న, కెచ్చల రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు పంట రుణాలు ఇవ్వడంలోనూ అన్ని విధాల విఫలం చెందాడని ఆరోపించారు. రోజుకో మాట చెబుతూ పూటకో హామీ ఇస్తూ రైతులను మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలిస్తానని సర్వేలు జరిపించి మళ్లీ వాటి ఊసేత్తడం లేదని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. అంబానీ, ఆదానీలకు దేశ సంపదను దోసిపెడుతూ, కార్పొరేట్లకు అన్ని విధాల అనుమతులు ఇస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలు తెచ్చారని ఆరోపించారు. రైతాంగ, ప్రజా పోరాటాలకు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం సంపూర్ణ మద్దతునిస్తుందని ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా జనరల్ కౌన్సిల్‌లో 25 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కల్లూరి కిషోర్, అధ్యక్షుడిగా బుర్ర వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కంగాల కల్లయ్య, సహాయ కార్యదర్శిగా బానోత్ ధర్మ, కోశాధికారిగా అప్పారావు, సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, పూణెం రమేష్, వై.ఆజాద్, నిమ్మల రాంబాబు, రాయబారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న గుమ్మడి నర్సయ్య

'రేగా.. మాటతీరు మార్చుకో..'



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట తీరుమార్చుకోవాలని, లేదంటే మూల్యం చెల్లించక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా హెచ్చరించారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీపీఐ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రేగా కాంతారావు తీరు ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసే విధంగా ఉంటుందని, అదే దృష్టితో ఇప్పుడు కూడా ఇతరులను చులకనగా మాట్లాడితే సహించబోమన్నారు. రేగా కమ్యూనిస్టులతో పొత్తు కుదిరిందని, రాజ్యసభ, ఎమ్మెల్సీలు ఇస్తే సరిపోతుందని చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్సీ కోసమో, రాజ్యసభ సీటు కోసమో లేక మార్కెట్ కమిటీల కోసమో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వటం లేదన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. బీజేపీ ముప్పును గ్రహించి కట్టడి చేసేందుకు మాత్రమే అంశాల వారీ మద్దతునిస్తున్నామని, ఎన్నికలు, పొత్తులు, ఇప్పటి అంశం కాదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు కాంతారావు గెలుపులో సీపీఐ కీలక భూమిక పోషించిందని, ఆ విషయాన్ని ఆయన గుర్తు తెచ్చుకోవాలన్నారు. అవసర మాటలు, అవగాహన లేని ప్రకటనలు భవిష్యత్ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఐక్యతను దెబ్బతీస్తుందని, కేవలం పొత్తులంటే మాకు మద్దతునిస్తే సరిపోతుందని, మేమే ఎవరికి మద్దతు ఇవ్వాల్సిలేదనుకుంటే పొరపాటేనన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామి, వెంకట్, శేషయ్య, హనుమంతరావు, రత్నకుమారి, సంపూర్ణ, పద్మజా, రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి అన్నారు.

ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల 3 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకుని మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని కోరారు. గౌరవ వేతనం రూ.3వేలు చెల్లించాలని, ప్రతి విద్యార్థికి రూ.25 చెల్లించాలని, కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ రాంచందర్ నాయక్, పుష్ప, లలిత, శారద, నాగ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు సంఘటితంగా పోరాడాలి

ఇల్లెందు: అడివిని నమ్ముకుని ఆదివాసీలతో సమానంగా అడివిలో జీవించే యాదవులకు అడివి మీద హక్కులు కల్పించాలని ఇల్లెందు యాదవ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేకల మల్లేష్ యాదవ్, కాలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో జరిగిన యాదవ సంఘం కాకతీయ నగర్, ఇందిరానగర్ శాఖల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూగ జీవాలను పెంచుకుని జీవించే యాదవులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఏజెన్సీలో జీవించే యాదవులకు మూగ జీవాలు పెంచుకునేందుకు అటవీశాఖ నుంచి ఇతర ఏజెన్సీ చట్టాల నుంచి ముప్పు పొంచి ఉందన్నారు. వెనుకబడిన యాదవులను ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకోవాలన్నారు. తక్షణమే వారికి రుణ సదుపాయాలు కల్పించాలని, జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని కోరారు. రెండో విడత గొర్రెల పంపకం పథకం అమలు చేయాలని, అకౌంట్లలో నిధులు జమా చేయాలని కోరారు. కార్యక్రమంలో పుచ్చకాయల నాగరాజు యాదవ్, లింగయ్య, రేళ్ల సత్యనారాయణ, నూకల వెంకటేశ్వర్లు, కాలసాని వెంకటేశ్వర్లు, మెరుగు కార్తీక్ యాదవ్, నాగరాజు, కొండల్‌రావు, శీలం లింగయ్య, జక్కుల కృష్ణ, లింగరాజు, సాంబశివరావు, రామకృష్ణ, వినయ్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న నాయకులు

మాజీ ఎంపీ పొంగులేటి పరామర్శ



యతిరాజ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు: గుండెపుడి గ్రామానికి చెందిన ఓ చానల్ రిపోర్టర్ కాళ్లూరు యతిరాజ్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి యతిరాజ్ కుమార్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా యతిరాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గుండెపుడి గ్రామ పంచాయతీ గుమస్తా వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎంపీ పరామర్శించారు. అనంతారం గ్రామానికి చెందిన బండారు వెంకటేశ్వర్లు కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను మాజీ ఎంపీ పొంగులేటి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, యతిరాజ్ కుమార్ సోదరుడు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు జడ్జి కాళ్లూరు ప్రభాకర్‌రావు, తండ్రి కాళ్లూరు వెంకటేశ్వరరావు, పాపకొల్లు ఎంపీటీసీ బానోత్ స్వాతి, ధరావత్ రాంబాబు, కల్యాణపు నరేష్, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మట్టి కుప్పను తొలగించరూ..

రాఘవాపురం గ్రామానికి వెళ్లే దారిలోని సుజాతనగర్ రైతు వేదిక ఎదురుగా ఉన్న మట్టి కుప్ప ప్రమాదకరంగా ఉంది. సరిగ్గా మూలమలుపు వద్దే ఈ మట్టి కుప్ప ఉండటంతో రాఘవాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇక్కడకు వచ్చే వరకు మట్టి కుప్ప కనిపించడం లేదు. తీరా ఇక్కడికి వచ్చాక అకస్మాత్తుగా వాహనాలకు బ్రేకులు వేయాల్సి రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మట్టి కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : బి.నరేందర్, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 8885377753